క్లుప్తంగా

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం



మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్

పార్వతీపురంటౌన్: ఈనెల 30న సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం ఉందని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర హాజరవుతారని, కౌన్సిలర్లు, అధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు.

ముగిసిన జిల్లా స్థాయి చెస్ పోటీలు



నర్సిపురంలో జరుగుతున్న ఉపాధ్యాయుల చెస్ పోటీలు

పార్వతీపురం టౌన్: యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లా స్థాయి ఉపాధ్యాయుల చెస్ పోటీలు నర్సిపురం జెడ్పీఉన్నత పాఠశాలలో ఆదివారం ముగిశాయి. విజేతగా నర్సిపురం జెడ్పీహెచ్‌ఎస్ పీడీ సబ్బాన మురళి, రన్నర్‌గా బి.బుచ్చిబాబు నిలిచారు. అక్టోబరు 4 నుంచి 6 వరకు విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని యూటీఎఫ్ నాయకుడు మురళి తెలిపారు.

పార్వతీపురం ట్రాఫిక్ ఎస్సైగా పాపయ్య



ట్రాఫిక్ ఎస్సై పాపయ్య

పార్వతీపురంటౌన్: జిల్లాలో పలువురు ఎస్సైలకు బదిలీలు చేస్తూ ఎస్పీ మాధవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో పార్వతీపురం ట్రాఫిక్ ఎస్సైగా పాపయ్య, డీఎస్బీ ఎస్సైలుగా ఎన్.శంకర్రావు, బి.దేవుడు, సీసీఎస్ ఎస్సైగా పి.సత్య నారాయణ, పీసీఆర్ ఎస్సైగా ఎ.మోహన్ రావులను నియమితులయ్యారు. అంకిత భావంతో విధులు నిర్వహించి. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఎస్పీ వారికి సూచించారు.

పీఓను కలిసిన గిరిజన సంఘం నాయకులు



పీఓ అశుతోష్ శ్రీవాత్సవకు పుష్పగుచ్ఛమిస్తున్న గిరిజన సంఘ నాయకులు

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవను ఆయన కార్యాలయంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి ఆయనను అభినందించారు. గిరిజనుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఇంటికుప్పల రామకృష్ణ, మంచాల పారమ్మ, కోలక గౌరమ్మ, సూరజ్ దొర పాల్గొన్నారు.

3 నుంచి మల్లెమ్మతల్లి ఉత్సవాలు



సీతంపేట: మండలంలోని దారిమల్లి సమీపంలో ఉన్న మల్లెమ్మ తల్లి గుడి వద్ద దసరా ఉత్సవాల నిర్వహణకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చేనెల 3న ముహూర్తపు రాట వేసి ఉత్సవాలు ప్రారంభించనున్నారు. ప్రతీ రోజు వివిధ పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 4న గాయిత్రి దేవి గా, 5న అన్నపూర్ణాదేవిగా, 6న లలిత త్రిపురాసుందరిగా, 7న మహచండీదేవిగా, 8న మహాలక్ష్మిగా, 9న సరస్వతిదేవిగా, 10న దుర్గాదేవిగా, 11న మహిషాసుర మర్దినిగా, 12న రాజరాజేశ్వరిగా అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. దుర్గాష్టమి రోజున 108 కలశాలతో అమ్మవారికి పూజలు, భజ న కార్యక్రమం, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. దసరా రోజున మల్లెమ్మ తల్లి ఊరేగింపు ఉంటుందన్నారు.

వంద రోజులైనా అమలు కాని ఉచిత ఇసుక

సీతంపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయినా ఇంతవరకు ఉచిత ఇసుక సరఫరా చేయకపోవడంపై సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇసుక కొరతతో ప్రజలు, భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. నియోజకవర్గంలో రాత్రి సమయంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకున్న వారు లేరన్నారు. హౌసింగ్ అధికారులు స్టాక్ పాయింట్ చూపించినా అక్కడ ఇసుక లేదన్నారు. ఇప్పటికైనా ఉచిత ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు.

ఈ రహదారికి మోక్షమెప్పుడో?

- రోడ్డు అధ్వానంగా ఉండడంతో నిలిచిన బస్‌సర్వీస్



బల్లకృష్ణాపురం జంక్షన్ వద్ద బీటీ రోడ్డుపై గోతులు

సీతానగరం:

జిల్లాలోని చినభోగిలి-మక్కువరోడ్డు'కు మోక్షం లేదా? ప్రాణభయంతో రాకపోకలు సాగించాల్సిందేనా? అని పలుగ్రామాల స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు, ప్రయాణికులు, నాలుగు మండలాల ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు పనులు పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయడం లేదని విమర్శిస్తున్నారు. పార్వతీపురం, బొబ్బిలి, సీతానగరం మండలాల ప్రజలు చినభోగిలి మీదుగా మక్కువ వెళ్లడానికి, దుగ్గేరు, శంబర, మక్కువ, సాలూరు ప్రాంతాలనుంచి విశాఖ, విజయనగరం, సుదూరప్రాంతాలకు రాకపోకలు చేయాల్సిన వారు రహదారిపై గోతులను చూసి ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. 15 కిలోమీటర్లు దూరమున్న చినబోగిలి నుంచి మక్కువ వరకూ గల ఎండీఆర్ బీటీరోడ్డులో 9చోట్ల గోతులున్నాయి. వాటికి మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నేడు సాలూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక..

సాలూరు పరిసర ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి సోమవారం సాలూరులోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా ఉన్నతాధికారులు నిర్వహిస్తారని తెలిసి పలువురు వినతి పత్రాలను ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. 'చినభోగిలి-మక్కువ ఆర్ అండ్‌బీ రోడ్డు' మీదుగా ప్రజలు ఎల్లప్పుడూ ఏడుస్తూ, తిట్టుకుంటూ ప్రయాణం చేస్తున్నారు. మక్కువ దాటాక మరో 5 కిలోమీటర్ల తరువాత ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే తల్లి, కల్పవల్లి శంబర పోలమాంబ ఆలయం ఉంది. ఏటా పెద్దఎత్తున సంక్రాంతి పండగ తర్వాత మూడు నెలల పాటు ఉత్సవాలు ఇక్కడ జరగడం అందరికీ తెలిసిందే. పండగ ముందు మీటింగులుపెట్టి రహదారిని బాగుచేస్తాం, మరమ్మత్తులు చేస్తామని చెప్పడం మినహా ప్రభుత్వం వచ్చి 100 రోజులైనా ఇంతవరకూ చేసింది శూన్యమని పెదవి విరుస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో చినభోగిలి నుంచి మక్కువ వరకు రోడ్డును శాశ్వతంగా వేస్తామని చెప్పి అందుకోసం ఎన్‌డీబీ నిధులు దాదాపు రూ.35 కోట్లను కేటాయించారు. ఈ మేరకు రోడ్డు పనులు జరుగుతుండగా సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఈ రోడ్డు నిర్మాణాన్ని బీవీఎస్ఆర్ అనే కాంట్రాక్టర్ చేపట్టి డబ్బులు రాకపోవడంతో చేతులెత్తేసినట్లు అధికారులు తెలియజేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజల ఇబ్బందుల దృష్ట్యా కలెక్టర్ స్పందించి నేటిప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఈ రోడ్డు నిర్మాణానికి సత్వరచర్యలు చేపట్టాలని స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.



చినభోగిలి, తామరఖండి గ్రామాల మధ్య కోతకు గురైన రోడ్డు



బగ్గందొరవలసలో ప్రమాదాలకు నిలయంగా బీటీరోడ్డుపై గొయ్యి

నిర్వహణ గ్రాంట్స్ విడుదల చేయాలి

పార్వతీపురంటౌన్: మండల విద్యాశాఖ కార్యాలయాల నిర్వహణ గ్రాంట్స్‌ను సత్వరమే విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌కు లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేసినట్లు మండల విద్యాశాఖాధికారులు అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈఓ కార్యాలయాల నిర్వహణ నిధులు (ఎమ్మార్సీ గ్రాంట్స్) గత రెండేళ్ల నుంచి విడుదల కాలేదన్నారు. ఇందువల్ల ఎంఈఓ కార్యాలయాల నిర్వహణ ఖర్చుల భారంతో ఎంఈఓలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. శాఖా పరంగా ఎటువంటి నిధులు రానప్పటికీ ఎంఈఓలు అన్ని ప్రభుత్వ విద్యా పథకాల నిర్వహణ కోసం , వివిధ సమావేశాలకు సొంత డబ్బులు ఖర్చు చేసి ఆయా కార్యక్రమాలు విజయవంతం చేస్తున్నారని చెప్పారు. ఇటీవల విద్యా శాఖ నిమిత్తం రూ.413 కోట్ల 46 లక్షల నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని, ఆ నిధులనుంచైనా ఎంఈఓ కార్యాలయాల నిర్వహణకు నిధులను సర్దుబాటు చేసినట్లయితే ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయ పడ్డారు. కార్యాలయం నిర్వహణ ఖర్చులు అధికంగా పెరిగిన దృష్ట్యా నిర్వహణ గ్రాంట్ ఈ ఏడాది నుంచి రూ. రెండు లక్షలకు పెంపుదల చేసి, విడుదల చేయాలని లేఖలో విజ్ఞప్తి చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం పేర్కొన్నారు.

గండి పడి పంటనష్టం



బగ్గందొరవలసలో కోతకు గురైన కల్వర్టు, నష్టపోయిన వరిచేను

సీతానగరం: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని బగ్గందొరవలసకు చెందిన రైతు కోట్ల సత్యనారాయణ వరి పొలంలో కల్వర్టుకు గండి పడడం వల్ల పంటనష్టం వాటిల్లినా ఇంతవరకూ అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు ఉధృతి పెరగడం వల్ల సీతానగరం సాగునీటి ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న బగ్గందొరవలస గ్రామంలో సత్యనారాయణ వరి పొలంలో కాలువనీరుతో పాటు వర్షం నీరు చేరడంతో పొలానికి దిగువనున్న మట్టికల్వర్టు కోతకు గురికావడంతో ఏపుగా పెరిగిన వరిచేను కొట్టుకుపోయి పంటనష్టం వాటిల్లినట్లు తెలియజేశాడు. ప్రకృతి వైపరీత్యం కారణంగా పంట నష్టం వాటిల్లిందని, ఖర్చు చేసి వేసిన మట్టి రోడ్డు కొట్టుకు పోయిందని అధికారులకు తెలియజేసినా ఇంతవరకూ పరిశీలించడం లేదని ఆందోళన వ్యక్తం చేశాడు. ఉన్నతాధికారులు స్పందించి పంటనష్ట పరిహారాన్ని, కోతకు గురైన మట్టికల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నాడు.

పాఠశాల స్వీపర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు

సాలూరు: పట్టణం, మండలంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్‌వైనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ కార్యదర్శి లక్ష్మి అధ్యక్షతన ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, స్వీపర్‌లకు ప్రభుత్వం ఇస్తున్న 6 వేల రుపాయల జీతాన్ని ప్రతినెల 5వ తేదీలోపు చెల్లించాలని కోరారు. మూడు నెలల బకాయి జీతాలు విడుదల చేయాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ వర్తింప చేయాలని విజ్ఞప్తి చేశారు. వర్కర్ల కనీస వేతన చట్టాన్ని అమలు చేసి జీతాలివ్వాలని డిమాండ్ చేశారు. అంతకుముందు దివంగత కమ్యూనిస్టు నాయకుడు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు పాల్గొన్నారు.

పేదలకు చేయూత



నిత్యావసర సరుకులు అందుకున్న వారితో క్రైస్తవ సోదరులు

పార్వతీపురం: పట్టణంలోని బెలగాం చర్చి వీధిలో గల పునీత కార్మిక జోజప్ప చర్చిలో ఫాదర్ థామస్ రెడ్డి ఆధ్వర్యంలో యువత 40 మంది పేదలకు నిత్యావసర సరుకులు, కొంత మొత్తాన్ని ఆదివారం అందజేశారు. చర్చిలో ప్రార్థనల అనంతరం నిరుపేదలకు సహాయ సహకారాలను అందించారు. సేవా కార్యక్రమాలకు విన్సెంట్ డి పాల్ విభాగాల యువత ముందుకు రావడం ఎంతో ఆనందంగా ఉందని, మరెన్నో సేవా కార్యక్రమాలకు, అభివృద్ధికి కార్యక్రమాలకు యువత ముందుకు రావాలని ఫాదర్ థామస్ రెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు క్రైస్తవ సోదరులు, సోదరీమణులు పాల్గొన్నారు.

'చదవడం మాకిష్టం'

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వాహకులు ఎస్.మధుసూదనరావు ఆధ్వర్యంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భగత్‌సింగ్ జీవిత విశేషా ల వివరించారు. నీతి కథలను చదివించడంతో పాటు చదరంగం, క్యారమ్స్ తదితర ఆటలు ఆడించారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



బైపాస్‌రోడ్డు వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటును పరిశీలిస్తున్న సీఐ అప్పలనాయుడు

సాలూరు:

రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా పట్టణ సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలుపుదల చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య అధికమవుతోందన్నారు. వాహనాలను నిర్దేశించిన ప్రాంతాల్లోనే పార్కింగ్ చేయాలని స్పష్టం చేశారు. నో పార్కింగ్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో వాహనాలను పార్క్ చేస్తే అపరాధ రుసుము విధించనున్నట్లు హెచ్చరించారు.

హెచ్‌సీ కృష్ణమూర్తికి ఎక్స్‌లెన్స్ అవార్డ్



డా.బీఆర్ అంబేడ్కర్ ఎక్స్‌లెన్స్ అవార్డ్ అందుకుంటున్న హెచ్‌సీ కె.కృష్ణమూర్తి

పార్వతీపురంటౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెచ్‌సీ కె.కృష్ణమూర్తికి సేవలు అభినందనీయని జీఎస్‌హెచ్‌ఏయూ అకాడమీ డైరెక్టర్ అండ్ చైర్మన్ డా.ఎం.వి ప్రసాద్ ప్రశంసించారు. ఈ మేరకు ఆదివారం విశాఖపట్నంలోని జిల్లా పబ్లిక్ గ్రంథాలయంలో జీఎస్‌హెచ్‌ఏయూ అకాడమీ ఆధ్వర్యంలో డా.బీఆర్ అంబేడ్కర్ ఎక్స్‌లెన్స్ అవార్డును ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు, వృద్ధులకు కృష్ణమూర్తి చేస్తున్న సేవలను అంతా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది బంగారి జార్జి, ఆంధ్ర విశ్వ విద్యాలయం హిందీ ప్రొఫెసర్ సూరప్పుడు, విశాఖపట్నం ఆర్‌జేడీ ప్రెసిడెంట్ నమ్మి అప్పలరాజు, హ్యూమన్ రైట్స్ స్టేట్ చైర్మన్ కొండపల్లి లక్ష్మి, విశాఖపట్నంలోని ప్రముఖులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సన్నద్ధం



- అక్టోబరు 3 నుంచి 12 వరకు ఉత్సవాలు
- ముస్తాబైన కోటదుర్గమ్మ ఆలయం
- తొమ్మిది రోజుల పాటు ఆలయంలో కుంకుమ పూజలు



దసరా ఉత్సవాలకు ముస్తాబైన కోటదుర్గతల్లి ఆలయం (ఇన్‌సెట్లో) వీరఘట్టం కోటదుర్గతల్లి

వీరఘట్టం: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం, భక్తుల పాలిట కల్పవల్లి శ్రీకోటదుర్గతల్లి శరన్నవరాత్రి ఉత్సవాలను అక్టోబర్ 3 నుంచి 12 వరకు నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. యజ్ఞకర్త యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు. గంగా, భవాని, గాయత్రి, కాళీ, చండీ, లక్ష్మి, సరస్వతి, రాజరాజేశ్వరి, లలితాదేవి అలంకరణలో అమ్మవారికి తొమ్మిది రోజులు పూజలు చేయనున్నారు. దశమి నాడు విజయదుర్గగా అమ్మవారిని అలంకరించి విశేష పూజలు చేయనున్నట్లు శర్మయాజీ తెలిపారు.

ఇదీ పూర్వ చరిత్ర..

వీరఘట్టం కోటదుర్గ తల్లి ఆలయానికి ఏళ్లనాటి చరిత్ర ఉందని పూర్వీకులు చెపుతున్నారు. అచ్చపువలస రాజుల పరిపాలనలో కోటలో వెలసిన దుర్గాదేవి ఈ రాజ్యాన్ని ఎంతో సుభిక్షంగా ఉంచేందుకు రాత్రులు ఊరిని పహారా కాసేవారని పెద్దలు చెపుతున్నారు. గజ్జెల సవ్వడితో ఊరి పొలిమేర్లల్లో తిరుగుతూ గ్రామంలోకి దుష్టశక్తులు రాకుండా కాపుకాచేవారని, అర్ధరాత్రి వేళ ఎవరైనా పని మీద బయటకు వస్తే వారికి వృద్ధురాలిగా కనిపించేవారని, యోగక్షేమాలు అడిగేవారని స్థానికులు అంటుంటారు. నేటికీ కూడా దుర్గగుడి సమీపంలో అర్ధరాత్రి వేళ గజ్జెల శబ్దం వినిపిస్తూ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. శుభకార్యాలకు, ఉద్యోగాలకు, పరీక్షలకు హాజరయ్యేవారు తప్పకుండా కోటదుర్గను దర్శించుకొని వెళుతుంటారు.

ఆలయానికి నూతన శోభ..

వీరఘట్టం కోటదుర్గ ఆలయాన్ని అత్యాధునిక హంగులతో జిల్లాకే తలమానికంగా ఏడాది క్రితం పునః నిర్మాణం చేశారు. ఏక శిలాయుత మకరతోరణ సింహవాహన పీఠస్థిత దుర్గా భవానీ విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించారు.

9 రోజుల పాటు కుంకుమ పూజలు..

శరన్నవరాత్రులు అక్టోబరు 3 నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి రోజు నుంచి 11వ తేదీ వరకు ఆలయ ప్రాంగణంలో మహిళలచే కుంకుమ పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే తొలి రోజు 108 మంది భవానీ, సంతోషిమాత భక్తులు మాలాధారణ చేయనున్నారు. వీరిచే ప్రతీ రోజు అమ్మవారికి హోమం చేస్తారు. 12న విజయదశమి రోజున భక్తులందరూ అమ్మవారిని దర్శించుకున్న తర్వాత సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి తిరువీధి నిర్వహిస్తారు.



మహిళలు కుంకుమ పూజలు చేసేందుకు వీలుగా సిద్ధం చేసిన ఆలయ ప్రాంగణం

దేవి దర్శనం శుభకరం

దసరా మహోత్సవాల్లో శరన్నవరాత్రులు విశ్వస్వరూపిణి అయిన ఆ మహాశక్తిని దర్శించుకోవడం శుభకరం. మహిమ గల కోటదుర్గ దర్శనం ఎంతో పుణ్యఫలం. భక్తులు ఆ అమ్మవారిని ప్రశాంతంగా దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. పది రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహంచనున్నాం. భక్తులంతా పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరుతున్నాం. – యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజి

నీటికి నేలకూ సమతౌల్యం అవసరం



ఊబాలు చేసిన పంటపొలాలు

బలిజిపేట: సాగునీటి వినియోగం సమతౌల్యంలో ఉండాలని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పంటకు నీరు ఎక్కువ అయినా, ఎద్దడి తలెత్తినా దిగుబడిపైనా, భూసారంపైనా ప్రభావం చూపుతుంది. నీరు, భూమికి ఉండే సహజలక్షణాలను గుర్తించి ఏభూమిలో ఏ నీటితో పంటలను పండించాలనేది రైతులు అవగాహనతో మెలగాలని సూచిస్తున్నారు.

నీటి వినియోగం ఇలా ఉండాలి

ఎకరా వరిపంటకు 1,250మిల్లీలీటర్ల నీరు అవసరం ఉంటుందని అంచనా. పైభాగాన ఉండే రైతులు అవగాహన లోపంతో ఎక్కువ నీటిని వినియోగిస్తారు. దీనివల్ల 20శాతం మంది పల్లపు ప్రాంత రైతులకు సాగునీటి సమస్య ఏర్పడుతుంది. సాగుదశలో సకాలంలో నీరు అందక పంట దిగుబడి తగ్గిపోతుంది. పైరుకు తడి 75శాతం వరకు తగ్గిపోతే ఆపంటకు నీటి ఎద్దడి ఉన్నట్లు లెక్క. పంటకు అవ సరం లేకుండా ముందస్తుగా నీరు పెట్టినా ప్రాణవాయువు దక్కక నష్టం కలిగే అవకాశాలు ఉన్నాయి. నాట్లు వేసేటప్పుడు నీరు పలుచగానూ, మొన తిరిగిన రోజు నుంచి పైరు దుబ్బు చేయడం పూర్తయ్యేవరకూ 2సెంటీమీటర్ల లోతులో నీరు ఉంటే సరిపోతుంది. చిరుపొట్టదశ నుంచి గింజ గట్టిపడేవరకు 5సెంటీమీటర్ల లోతులో నీరు ఉండాలి. ఈనిక, చిరుపొట్ట దశల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్త వహించాలి. కోతకు పదిరోజుల ముందుగా నీటిని నెమ్మదిగా తగ్గించాలి. నీరు ఎక్కువైతే పైరు దుబ్బు బాగా చేయదని అధికారులు చెబుతున్నారు.

నీటి లక్షణాన్ని, పరిమితిని పరిగణనలోకి తీసుకోవాలి

నీరు ఎక్కువైతే తెగుళ్ల, పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. పిలకలు పెట్టే సామర్థ్యం తగ్గుతుంది. నీరు తక్కువగా ఉంటే చేను పెరగదు. నీరు తక్కువగా అందే భూములలో ఆరుతడి పంటలను సాగుచేయడం మంచిది. ఉప్పు నీటితో పంట దిగుబడి తగ్గిపోతుంది. నీటిని పరీక్ష చేయించుకున్న తరువాత మాత్రమే పంటకు ఉపయోగించుకోవాలి.

ఉప్పునీరు వల్ల చౌడు పెరుగుతుంది. మురుగు కాల్వల్లోని నీటిలో బైకార్బొనేట్లు, లవణీయత, సోడియం కార్బొనేట్లు ఎక్కువగా ఉంటాయి. ఈ నీరు దిగుబడికి ప్రతికూలం. సాగునీరు క్షార స్వభావం కలిగి ఉంటే మెగ్నీషియం తక్కువగాను, సోడియం అధికంగానూ ఉంటుంది. సోడియం వల్ల మొక్కలకు హాని కలుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు వివరిస్తున్నారు.